నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM
www.suryaa.com









# సాయంత్రానికి సస్పెన్స్‌కు తెర!

## సీఎంగా రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంగా భట్టి!



తెలంగాణ సీఎం ఎవరనే సస్పెన్స్‌కు ఇవాళ సాయంత్రానికి తెరపడనున్నట్లు తెలుస్తోంది. సీఎం, మంత్రుల జాబితాపై ఖర్గేతో చర్చించి ఫైనల్ చేయనున్నారు. అనంతరం డీకేఎస్‌తో పాటు మిగిలిన పరిశీలకులు సీల్డ్ కవర్‌తో మధ్యాహ్నమే హైదరాబాద్ బయలుదేరారు. డీకే శివకుమార్ నేరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బస చేసిన ఎల్లా హోటల్‌కు వెళ్లి వారితో సమావేశమవుతారు. అక్కడ సీల్డ్ కవర్‌లో ఉన్న సీఎం పేరును ప్రకటిస్తారు. అనంతరం ముఖ్యమైన పోర్ట్‌ఫోలియోలకు మంత్రులెవరనేది కూడా వెల్లడిస్తారు. మొత్తానికి సీఎం పదవి చేపట్టనుందెవరనేది సాయంత్రానికి తేలిపోయే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సీఎం ప్రమాణ స్వీకారం ఎప్పుడుంటుందనేదానిపై పేరు ప్రకటించిన తర్వాతే క్లారిటీ వచ్చే ఛాన్సుంది. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లు గెలిచి మ్యాజిక్ ఫిగర్ సాధించిన విషయం తెలిసిందే. లెజిస్లేచర్ పార్టీ లీడర్ (సీఎల్పీ) నేతను ఎన్నుకోవడానికి గెలిచిన ఎమ్మెల్యేలంతా గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్‌లో సోమవారం సమావేశమయ్యారు. అయితే ఈ విషయంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో సీఎం ఎంపిక బాధ్యతను అధిష్ఠానానికి అప్పగిస్తూ ఎమ్మెల్యేలు ఏకవ్యాఖ్య తీర్మానం చేసి పంపించారు. తర్వాత డీకే శివకుమార్ సహా ఏఐసీసీ పరిశీలకులు ఢిల్లీ వెళ్లారు. అంతకుముందు.. తెలంగాణ సీఎం అభ్యర్థి ఎంపిక, ఇతర అంశాలపై చర్చించేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆ పార్టీ అగ్రనేతలు సమావేశమయ్యారు. ఈ కీలక భేటీకి రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్ వంటి నాయకులు హాజరయ్యారు. తెలంగాణ పరిణామాలు, సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు చెప్పిన అభిప్రాయాలపై ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం ముగిసిన అనంతరం ఖర్గే నివాసం నుంచి రాహుల్‌గాంధీ వెళ్లిపోయారు. తెలంగాణ సీఎం అభ్యర్థి ఎంపికపై కర్ణాటక డిప్యూటీ సీఎం, ఏఐసీసీ పరిశీలకుడు డీకే శివకుమార్ స్పందించారు. సీఎల్పీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానానికి చెప్పడం వరకే తన బాధ్యత అని చెప్పారు.



## ఎల్లుండి ప్రమాణ స్వీకారం

**మరికొన్ని గంటల్లోనే ఈ ప్రతిష్టంభన తొలగిపోతుందని స్వయంగా ఖర్గే మీడియాకు వివరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పేర్లను వెల్లడించనున్నట్లు తెలిపారు. మరోవైపు పూర్తి స్థాయిలో మంత్రివర్గం కూడా 7వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వార్తాలు వెలువడుతున్నాయి. కానీ ఏఐసీసీ పెద్దలు మాత్రం తొలుత సీఎం, డిప్యూటీ సీఎం వ్యవహారాన్ని తేల్చేస్తామని, ఆ తర్వాత మంత్రి వర్గం మీద ఫోకస్ పెడతామన్నారు. ఉత్తమ్ కోరుకుంటున్న అంశాలు భట్టి విక్రమార్క షరతులు.. వీటిపై ఏఐసీసీ నేతలు మీడియాతో మాట్లాడానికి నిరాకరించారు.**

## ఖర్గేతో డీకే శివకుమార్ కీలక భేటీ...

తెలంగాణ సీఎం ఎంపికపై ఏఐసీసీ చీఫ్ ఖర్గే నివాసలంలో కీలక భేటీ జరుగుతోంది. ఈ భేటీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. తెలంగాణ ఎన్నికల ముఖ్య పరిశీలకుడు డీకే శివకుమార్, పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ ఠాక్రే ఏఐసీసీ చీఫ్ ఇంటికి వెళ్లారు. హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన ఎమ్మెల్యేల అభిప్రాయాలతో పాటు ఉత్తమ్, భట్టిలతో జరిగిన సమావేశ వివరాలపై డీకే ఏఐసీసీ చీఫ్‌కు నివేదిక అందించారు.

## కొత్త ప్రభుత్వంలో మంత్రులెవరు?

కొత్త ప్రభుత్వంలో మంత్రులెవరన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. శాసనసభ ఎన్నికల్లో మెజార్టీ సాధించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ త్వరలోనే మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయనుంది. సీఎం ఎంపికపై అధిష్ఠానం నుంచి ఇంకా నిర్ణయం రాకపోవడంతో ఆరు లేదా తొమ్మిదో తేదీన ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో పూర్తిస్థాయి మంత్రివర్గం ఒకేసారి బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రితో కలిపి 18 మందితో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పదవికి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పోటీ పడుతున్నా.. రేవంత్, భట్టి మధ్యనే ప్రధాన పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కాకుండా మరో 16 మందికి అవకాశం ఉంటుంది. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని మంత్రివర్గ కూర్పు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఉమ్మడి జిల్లాల వారీగా పరిశీలిస్తే ప్రత్యేకించి మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ఎక్కువ మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. గతంలో మంత్రులుగా పనిచేసిన అనుభవంతోపాటు రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వారు, గతంలో ఎంపీలుగా చేసి ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచిన వారిని మంత్రి పదవులకు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. మొదటిసారి శాసనసభలోకి అడుగుపెట్టిన వారికి అవకాశం ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఆదిలాబాద్ నుంచి వివేక్, ప్రేమసాగర్‌రావు, నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి, కరీంనగర్ నుంచి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పేర్లను పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి జగిత్యాల నుంచి ఓడిపోయినా ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని ఈయనకు అవకాశం ఇస్తారో లేదో చూడాల్సి ఉంది. మైనార్టీ వర్గం నుంచి పోటీ చేసిన వారంతా ఓడిపోయారు. ఈ నేపథ్యంలో షబ్బీర్‌అలీని మంత్రివర్గంలోకి తీసుకొని మండలికి పంపుతారనే ప్రచారం కూడా ఉంది. మెదక్ జిల్లా నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా పేరు ఖరారైనట్లే. ఈ జిల్లా నుంచి మరొకరికి అవకాశం తక్కువే. మహబూబ్‌నగర్ నుంచి రేవంత్‌రెడ్డిని మినహాయిస్తే.. జూపల్లి కృష్ణారావు, వంశీకృష్ణ పేర్లతోపాటు షాద్‌నగర్ నుంచి గెలుపొందిన శంకర్ పేరును కూడా పరిశీలించవచ్చని తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లాలో గడ్డం ప్రసాద్, మల్‌రెడ్డి రంగారెడ్డి, రామమోహన్‌రెడ్డిల నుంచి ఎంపిక చేసే వీలుంది. నల్గొండ జిల్లాలో సీనియర్ నాయకులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నారు. ఉత్తమ్ ఆసక్తి చూపకపోతే ఆయన భార్య పద్మావతికి అవకాశం ఇవ్వవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వరంగల్ నుంచి సీతక్క, కొండా సురేఖ ఉన్నారు. ఖమ్మం జిల్లా నుంచి భట్టి విక్రమార్కతోపాటు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. స్పీకర్ ఎవరన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం జిల్లాలో ఉన్న పోటీని పరిగణనలోకి తీసుకొని తుమ్మల పేరును స్పీకర్ స్థానానికి పరిశీలించే అవకాశం లేకపోలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## క్లియెరెన్స్ ఇచ్చినా కన్‌ఫ్యూజన్ ఎందుకు.?

## ఈరోజైనా క్లారిటీ వస్తుందా.?



తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ప్రమాణస్వీకారం ఎందుకు ఆగింది.? క్లియెరెన్స్ ఇచ్చినా కన్‌ఫ్యూజన్ ఎందుకు? రేవంత్‌కు సీఎం పదవి ఇవ్వడంపై ఏకాభిప్రాయం కుదిరిందా? కుదిరితే ప్రమాణస్వీకారానికి ఎందుకు జాప్యం.? సీఎం రేసులో రేవంత్‌తో పాటు భట్టీ, ఉత్తమ్, జానారెడ్డి ఇంకా చాలా మంది పేర్లు ఎప్పటి నుంచో రీసౌండ్ ఇస్తున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్‌లో అంతర్గతం ఏం జరుగుతోంది. సీఎం పదవిపై ఏకాభిప్రాయం వచ్చినా.. డిప్యూటీ సీఎం..కేబినెట్ శాఖలపై ఏకత్వం పొసగడంలేదా? రేవంత్.. భట్టి విక్రమార్క.. ఉత్తమ్‌కుమార్.. శ్రీధర్‌బాబు.. పొన్నం ప్రభాకర్ అండ్ కోమటిరెడ్డి బ్రదర్స్, ఎవరి ఆవాజ్ ఏంటన్నది చర్చగా మారిందిప్పుడు. కొత్త సర్కార్‌లో డిప్యూటీ సీఎం ఒకరా ? ఇద్దరా? పీసీసీ పగ్గాలెవరికి? ఎల్లా హోటల్ మీటింగ్ సారాంశం ప్రకారం .. సామాజిక సూత్రం ప్రకారం ఎస్టీ, బీసీలకు చెరొకటి చొప్పన రెండు డిప్యూటీ సీఎంలు ఇవ్వాలన్నది పార్టీ లైన్. రేవంత్‌కు సీఎం.. భట్టికి డిప్యూటీ సీఎం. ఇంత వరకు ఓకే. కానీ బీసీ కోటాలో పొన్నం ప్రభాకర్ డిప్యూటీ సీఎం గిరిపై గురిపెట్టారట. కానీ భట్టి నుంచి అబ్జక్షన్. ఉంటే ఒకరే డిప్యూటీ సీఎం ఉండాలన్నది భట్టి వాదన. దాంతో భట్టికి స్పీకర్ పదవి ఆఫర్ చేశారట పార్టీ పెద్దలు. ఒకవేళ ఆయన అందుకు అంగీకరించకపోతే శ్రీధర్‌బాబుకు స్పీకర్ పదవి ఇవ్వాలనేది సమాలోచనల సారాంశం. ఇదిలా ఉంటే టు టర్మ్స్ పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి తన మన్ కీ బాత్‌ను స్పష్టం చేశారు. తనకు సీఎం పదవి ఇవ్వకపోతే తన సతీమణి పద్మావతికి కేబినెట్‌లో కీలక శాఖ ఇవ్వాలని కోరినట్టు తెలుస్తోంది. ఎల్లా హోటల్‌లో గెలిచిన అభ్యర్థుల సమక్షంలో చర్చోపచర్చలు జరుగుతుంటే మరోవైపు పార్క్ హయత్ హోటల్‌లో కోమటిరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో టేబుల్ బేటీలు జరిగాయి. రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం ఏర్పాట్లు.. కొత్త సర్కార్‌కు కాన్వాయ్ అరెంజ్‌మెంట్ చకచకా జరిగాయి. కానీ ఎల్లా హోటల్ సమావేశం నుంచి మాత్రం సీఎం ఎవరనే సందేశం రాలేదు. సడెన్‌గా సీను ఢిల్లీకి మారింది. షరామాములుగానే మళ్లీ సీల్డ్ కవర్ కాంగ్రెసీయం తెరపైకి వచ్చింది. ప్రమాణ స్వీకారం ఆలస్యానికి కారణం..సీఎం ఎవరనే ఇంకా తేలకపోవడమా? రేవంత్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చినా డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్, కేబినెట్‌లో కీలక శాఖలపై అభిప్రాయాలు పొసగకపోవడమా? ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విక్టరీ రన్ ఊపందుకోగానే రేవంత్ రెడ్డి గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టారు. ప్రగతి భవన్‌ను అంబేద్కర్ ప్రజా భవన్‌గా మారుస్తామన్నారు. కాబోయే సీఎం ఎవరో తెలంగాణ సమాజానికి రేవంత్ ప్రెస్‌మీట్ సందేశం ఇచ్చిందని అంతా భావించారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఇంటర్నల్ జరుగుతోన్న కిస్సా కూడా సీఎం కుర్చీ కోసం కాదని.., ముఖ్యమంత్రిగా రేవంత్‌నే హైకమాండ్ డిసైడ్ చేసిందని... కేవలం డిప్యూటీ సీఎం..పీసీసీ చీఫ్, స్పీకర్, కేబినెట్‌లో కీలక శాఖల గురించే అంతర్మథనం అనేది ఓ చర్చ. ఎంతైనా కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం రూటే సపరేటు. తెలంగాణలో కాంగ్రెస్ పైచేయి సాధించింది. తెలంగాణ సర్కార్ ఏర్పాటు మాత్రం ప్రస్తుతం కాంగ్రెస్ హైకమాండ్ చేతిలో వుంది. 3 రాష్ట్రాల్లో ఓటమిపై సమీక్ష..పార్లమెంట్ సమావేశాలతో హైకమాండ్ బీజీగా వుంది. అందువల్లే తెలంగాణ సర్కార్ ఏర్పాటుపై ఫోకస్ పెట్టే సమయం చిక్కలేదనేది నిజమా? అబ్జర్వర్లతో కొలిక్కి రాలేదు కాబట్టే హైదరాబాద్ మ్యాటర్ ఢిల్లీ గట్టుకు చేరిందా? 7న ప్రమాణస్వీకారం చేసేదెవరు? ఢిల్లీ నుంచి తరలి వచ్చే అతిథులు ఎవరు? హైకమాండ్ ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందని ఎదురుచూస్తోంది టీ కాంగ్రెస్. అన్నీ మంచిశకునాలే వున్నా ఇంకా వై దిస్ లేట్ వర్రీ..!

## తెలంగాణ సీఎం అభ్యర్థి ఎంపిక..

## ఖర్గే నివాసంలో ముగిసిన కీలక భేటీ

తెలంగాణ సీఎం అభ్యర్థి ఎంపిక, ఇతర అంశాలపై చర్చించేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆ పార్టీ అగ్రనేతలు సమావేశమయ్యారు. ఈ కీలక భేటీకి రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. తెలంగాణ పరిణామాలు, సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు చెప్పిన అభిప్రాయాలపై ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం ముగిసిన అనంతరం ఖర్గే నివాసం నుంచి రాహుల్‌గాంధీ వెళ్లిపోయారు.

**నా బాధ్యత అంత వరకే: డీకే శివకుమార్**

అంతకుముందు తెలంగాణ సీఎం అభ్యర్థి ఎంపికపై కర్ణాటక డిప్యూటీ సీఎం, ఏఐసీసీ పరిశీలకుడు డీకే శివకుమార్ స్పందించారు. సీఎల్పీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానానికి చెప్పడం వరకే తన బాధ్యత అని చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడి నిర్ణయం మేరకు సీఎల్పీ నేత ఎంపిక ఉంటుందని సోమవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానించారని గుర్తుచేశారు. సీఎల్పీ అభిప్రాయంపై నివేదిక ఇచ్చేందుకే వచ్చానని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు తెలంగాణ సీఎం అభ్యర్థి, ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

## డీకేతో ఉత్తమ్ భేటీ..

## సీఎంగా ఎవరైనా నాకు ఒకే



ఢిల్లీలో తెలంగాణ సీఎం ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. కాసేపటి క్రితం డీకే శివకుమార్ తో కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. సీఎం, కేబినెట్ పైన ఇద్దరు చర్చించినట్లు తెలుస్తోంది. భేటీ అనంతరం మాట్లాడిన ఉత్తమ్ సీఎంగా ఎవరిని ప్రకటించినా తమకు ఆమోదమేనని చెప్పారు. తన ఎంపీ పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. సీఎం, ఇతర అంశాలపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందన్నారు డీకే శివకుమార్. సీఎల్పీ నిర్ణయాన్ని హైకమాండ్ కు అందజేయడం వరకే తన చేతుల్లో ఉందన్నారు. సీఎం అభ్యర్థిని ఖర్గే ప్రకటిస్తారని చెప్పారు. మరో వైపు ఢిల్లీలోని ఖర్గే నివాసంలో సీనియర్ నేత కేసీ వేణుగోపాల్,డీకేతో రాహుల్ భేటీ అయ్యారు. సీఎం ఎంపికపై చర్చిస్తున్నారు. మరి కాసేపట్లో సీఎం ఎవరనేది క్లారిటీ వస్తుంది. సీఎం,డిప్యూటీ సీఎం ఎవరన్నది అధిష్ఠానం ఖరారు చేసిన తర్వాత ఏఐసీసీ పరిశీలకులు మళ్లీ హైదరాబాద్‌కు రానున్నారు. హైదరాబాద్ లోనే ముఖ్యమంత్రిపై అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఇవాళ( డిసెంబర్ 5న) సాయంత్రంలోపు సీఎం అభ్యర్థిని ఫైనల్ చేస్తామని .. ఇవాళే సీఎం పేరును ప్రకటిస్తామని మల్లికార్జున ఖర్గే వెల్లడించిన సంగతి తెలిసిందే. తెలంగాణ ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ 64 సీట్లు..బీఆర్ఎస్ 39 సీట్లు ,బీజేపీ 8, ఎంఐఎం 7 సీట్లు గెలుచుకున్నాయి.




## తెలంగాణలో ఎన్నికైన 80 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు..

**తెలంగాణలో కొత్తగా ఎన్నికైన 80 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 16 మందిపై తెలంగాణ ఉద్యమం, మోడల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే ఎన్జీవో సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. కొత్తగా ఎన్నికైన 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 50 మందిపై కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసులు ఉన్న నాయకుల్లో 78 శాతం మంది అధికార పార్టీ (కాంగ్రెస్) ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 39 మంది ఎమ్మెల్యేలలో 19 మంది (48 శాతం)పై కేసులు ఉన్నాయని ఎన్జీవో తెలిపింది. బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఏడుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ రకంగా బీజేపీలో అత్యధికంగా 87 శాతం ఎమ్మెల్యేలపై కేసులు ఉన్నాయి. ఎంఐఎంకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేల్లో నలుగురిపై (57 శాతం) కేసులు కూడా ఉన్నాయి. రాజకీయ పార్టీలు నేర చరిత్ర ఉన్న వ్యక్తులకు టిక్కెట్లు ఇవ్వరాదని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, పార్టీలు గెలుపే ప్రమాణంగా తీసుకుంటున్నాయని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం. పద్మనాభ రెడ్డి అన్నారు. గత నెలలో, ఎన్జీవో అభ్యర్థుల నేర చరిత్రను విశ్లేషించింది, నాలుగు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన 226 మంది నామినీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని గుర్తించింది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను ఒక కమిటీ విశ్లేషించి నివేదికను సిద్ధం చేసింది. కాంగ్రెస్‌లోని 118 మంది అభ్యర్థుల్లో 84 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. అత్యధిక క్రిమినల్ కేసులున్న తెలంగాణ నేతల్లో.. టీసీసీసీ చీఫ్.. రేవంత్ రెడ్డి 89 కేసులు ఉన్నాయి. తర్వాత ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన వెడ్మ బొజ్జుపై 52 కేసులు, మంచిర్యాలకు చెందిన కొక్కిరాల ప్రేంసాగర్ రావుపై 32 కేసులు ఉన్నాయి. వీరంతా తాజాగా విజయం సాధించారు. ఇక గోషామహల్ నుంచి రెండోసారి ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే టి.రాజా సింగ్‌పై 89 కేసులున్నాయి. ఇక కరీంనగర్ నుంచి రెండోసారి ఎన్నికైన బీఆర్ఎస్ నేత గంగుల కమలాకర్‌పై 10 కేసులు ఉన్నాయి. గజ్వేల్ నుంచి మళ్లీ ఎన్నికైన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుపై తొమ్మిది కేసులున్నాయి. అలాగే.. సిరిసిల్ల నుంచి రెండోసారి ఎన్నికైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుపై ఎనిమిది కేసులున్నాయి. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై ఆరు కేసులు ఉండగా, మరో ముగ్గురిపై ఒక్కో కేసు ఉంది.**




## ఉద్యోగుల వేతనాల కోసం ఇంటిని తనఖా పెట్టిన బైజూ రవీంద్రన్!

ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు ఆర్థిక కష్టాలు మరింత ఎక్కువైనట్లు తెలుస్తోంది. ఉద్యోగులకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితులు ఏర్పడ్డట్లు సమాచారం. ఫలితంగా కంపెనీ వ్యవస్థాపకుడు బైజూ రవీంద్రన్ తన సొంత ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకున్నారని తెలుస్తోంది. అలాగే కుటుంబ సభ్యుల ఆస్తులను సైతం తాకట్టు పెట్టారని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపినట్లు 'బ్లూమ్‌బెర్గ్' కథనం వెల్లడించింది. బెంగళూరులో ఉన్న రెండు ఇళ్లతో పాటు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఓ విల్లాను కూడా రవీంద్రన్ తనఖా పెట్టారని సమాచారం. తద్వారా 12 మిలియన్ డాలర్ల నిధులు సమకూరాయని తెలుస్తోంది. వీటితో మాతృసంస్థ 'థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్' ఉద్యోగులకు వేతనాలు చెల్లించినట్లు కంపెనీ వ్యవహారాలతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపారు. కంపెనీని ఒడుదొడుకుల నుంచి గట్టెక్కించేందుకు రవీంద్రన్ అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారని సమాచారం. అలాగే ఆర్థిక ఒత్తిళ్ల నుంచి వీలైనంత త్వరగా బయటపడేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు కంపెనీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలో అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న డిజిటల్ రీడింగ్ ప్లాట్‌ఫామ్‌ను 400 మిలియన్ డాలర్లకు విక్రయించే యత్నాల్లో ఉంది. మరోవైపు 1.2 బిలియన్ డాలర్ల రుణంపై వడ్డీ చెల్లింపుల విషయంలో బైజూస్ ఇప్పటికే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. రవీంద్రన్ సంపద ఓ దశలో ఐదు బిలియన్ డాలర్లకు చేరిన విషయం తెలిసిందే. వ్యక్తిగత హోదాలో ఆయన తన షేర్లను తనఖా పెట్టి 400 మిలియన్ డాలర్ల వరకు సమకూర్చుకున్నారు. గత కొన్నేళ్లలో తన వ్యక్తిగత షేర్లను విక్రయించి 800 మిలియన్ డాలర్లు కంపెనీలోకి మళ్లించినట్లు సమాచారం.



## 18 నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు

రాష్ట్రవ్యాప్తంగా 1.42 కోట్ల కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను ఈ నెల 18 నుంచి పంపిణీ చేస్తామని వైద్యారోగ్య శాఖ తెలిపింది. సీఎం జగన్ అధ్యక్షతన తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం వైద్యారోగ్య శాఖ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు.. పెద్ద మొత్తంలో ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నందున ముద్రణ కొనసాగుతోందని, ఇది వరకే ఆరోగ్యశ్రీకి సంబంధించిన సమాచారంతో బ్రోచర్లు సిద్ధం చేశామని వెల్లడించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు, పురోగతిని సీఎంకు అధికారులు వివరించారు.

జనవరి 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి మండలంలో జనవరి 1 నుంచి ప్రతి వారం ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తామని సీఎంకు అధికారులు వివరించారు. 2023-24లో నవంబరు నెలాఖరు నాటికి 12.42 లక్షల మంది ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స తీసుకున్నారని, ఇది గత ఏడాది కంటే 24.64 శాతం అధికమని వెల్లడించారు. చైనాలో విస్తరిస్తున్న హెచ్9ఎన్2 వైరస్ దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ సిబ్బంది కొరత ఉండకూడదని అధికారులకు సీఎం జగన్ స్పష్టం చేశారు.




## చంద్రబాబుపై సీఐడీ పీటీ వారెంట్లు.. తోసిపుచ్చిన ఏసీబీ కోర్టు

తెదేపా అధినేత చంద్రబాబుపై సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్లను విజయవాడలోని ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. చంద్రబాబు జైలులో ఉండగా ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్ కేసుల్లో విచారించాలని సీఐడీ పీటీ వారెంట్లు దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ఏసీబీ కోర్టు.. చంద్రబాబు బెయిల్‌పై ఉన్నందున వారెంట్లు నిరర్థకమవుతాయంటూ వాటిని తోసిపుచ్చింది.




## పాక్‌లో మరో ఖలిస్థానీ ఉగ్రవాది మృతి..!

పాకిస్థాన్‌లో మరో ఖలిస్థానీ ఉగ్రవాది మృతి చెందాడు. ఖలిస్థానీ లిబరేషన్ ఫోర్స్, ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్ (ఐఎస్‌వైఎఫ్) సంస్థలకు చీఫ్ అయిన లఖ్‌బీర్ సింగ్ రోడే డిసెంబర్ 2న గుండెపోటుతో మరణించాడు. అతడిని భారత ప్రభుత్వం గతంలోనే ఉగ్రవాదిగా ప్రకటించింది. రోడే మరణాన్ని భారత్‌లో ఉంటున్న అతడి సోదరుడు జస్‌బీర్ సింగ్ ధ్రువీకరించాడు. కెనడాలో ఉంటున్న లఖ్‌బీర్ కుమారుడి నుంచి తనకు ఈ సమాచారం అందిందని పేర్కొన్నాడు. పాక్‌లోనే అతడి అంత్యక్రియలను పూర్తిచేసినట్లు వెల్లడించాడు.



## మిచౌంగ్ దెబ్బకు చెన్నై అతలాకుతలం..
# పూర్తిగా స్థంభించిన నగరం

మిచౌంగ్ తుఫాన్ బీభత్సం సృష్టిస్తోంది. భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమిళనాడుపై తుఫాన్ ప్రభావం ఓ రేంజ్‌లో ఉంది. ముఖ్యంగా చెన్నై నగరం చిగురుటాకులా వణికిపోతోంది. చెన్నైలోని ప్రధాన రహదారులన్నీ జలమయం అయ్యాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల కారణంగా చెన్నై అంధకారంగా మారింది. భారీ వర్షాల కారణంగా 8 మంది మృతి చెందారు. చెన్నై సహా తిరువల్లూరు, కాంచీపురం, చెంగల్‌పట్టులో రెడ్ అలర్ట్ జారీ చేశారు. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. అత్యధికంగా ఆవడి ప్రాంతంలో 30 సెం.మీ వర్షపాతం కురిసింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా సబ్‌వేలు మూసివేశారు. నిత్యవసర సరకుల కోసం జనం ఇక్కట్లు పడుతున్నారు. సహాయక చర్యలు కోసం సైన్యం రంగంలోకి దిగింది.

**చెన్నైపై తుఫాన్ ప్రభావం..**

మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు చెన్నై అతలాకుతలమైంది. నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు చోట్ల వీధుల్లోకి భారీగా వరద నీరు చేరి పలు కార్లు కొట్టుకుపోయాయి. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరింది. పలు కాలనీల్లో నీరు నిలిచిపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఇక చెంగల్పట్టులోని పలు ప్రాంతాలపై భారీ వర్షం, సముద్రపు గాలులు తీవ్రమైన ప్రభావం చూపుతోంది.

**అధికారుల సహాయక చర్యలు..**

చెన్నైలో పలు సబ్‌వేలను మూసేశారు. నీటి ప్రవాహానికి కార్లు కొట్టుకుపోయాయి. NDRF, SDRF బలగాలు సహాయక చర్యలు చేపట్టాయి..ఇప్పటి వరకూ 300 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు..ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచించారు. ఇక భారీ వర్షానికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## మిగ్‌జాం ఎఫెక్ట్.. హైదరాబాద్ సహా

తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ వర్షం

మిగ్‌జాం తుపాను ప్రభావంతో తెలంగాణలోనూ పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో వర్షం పడుతోంది. హైదరాబాద్‌లోని మియాపూర్, కూకట్‌పల్లి, మూసాపేట, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్, అమీర్‌పేట, ఖైరతాబాద్, నాంపల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్డుపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, అశ్వారావుపేట, నేలకొండపల్లి, ఇల్లెందు, అన్నపురెడ్డిపల్లి, కల్లూరు, ఆళ్లపల్లి, సత్తుపల్లిలో వర్షం పడుతోంది. వర్షంతో ఇల్లెందు



సమీపంలోని సింగరేణి ప్రాంతంలో ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. తుపాను ప్రభావంతో ఇప్పటికే ఏపీలోని తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల గంటకు 90కి.మీపైగా వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో చాలా చోట్ల పంటలకు తీవ్ర నష్టం జరిగింది. గంటకు 7కి.మీ వేగంతో మిగ్‌జాం తుపాను ముందుకు కదులుతోంది. తెలంగాణ మధ్యాహ్నం ఒంటిగంట వరకు వర్షం కురిసే అవకాశం ఉన్న జిల్లాలను వాతావరణశాఖ ప్రకటించింది. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, జనగాం, ఖమ్మం, మహబూబాబాద్, నాగర్‌కర్నూలు, నల్గొండ, రంగారెడ్డి, సూర్యాపేట, వనపర్తి, వరంగల్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వర్షం కొనసాగనుందని తెలిపింది.

## మిగ్‌జాం ఎఫెక్ట్: కూలిన చెట్లు..
## వేలాది ఎకరాల్లో పంట నష్టం

మిగ్‌జాం తీవ్ర తుపాను ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడుతున్నాయి. తిరుపతి జిల్లా చిట్టేడులో అత్యధికంగా 39 సెం.మీ., నెల్లూరు జిల్లా మనుబోలులో 36.8సెం.మీ., తిరుపతి జిల్లా అల్లంపాడులో 35సెం.మీ వర్షపాతం నమోదైంది. చిల్లకూరులో 33సెం.మీ, నాయుడుపేటలో 28.7 సెం.మీ, ఎడ్లలి 24సెం.మీ, బాపట్ల 21సెం.మీ, మచిలీపట్నం 14.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో చాలా చోట్ల 10సెం.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఉత్తర కోస్తా జిల్లాల్లోనూ చాలా చోట్ల మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో 24 గంటలపాటు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలకు వర్ష సూచనలు ఉన్నాయి. నెల్లూరు జిల్లా కావలి రైల్వే స్టేషన్ సెంటర్‌లో తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని చర్యలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా చిట్వేలు మండలంలో వేలాది అరటిచెట్లు నేలకొరిగాయి. నేతివారిపల్లి, నగిరిపాడు పరిధిలో సుమారు 25వేల అరటిచెట్లు నేలకూలినట్లు రైతులు అంచనా వేస్తున్నారు.తుపాను ప్రభావంతో బాపట్ల జిల్లా సూర్యలంక తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం 20 మీటర్లు ముందుకు వచ్చింది. అక్కడి తుపాను రక్షిత భవనంలో స్థానిక గిరిజనులకు పునరావాసం కల్పించారు. వర్షం, గాలుల తీవ్రతకు సూర్యలంక బీచ్ పోలీస్ అవుట్ పోస్ట్ కూలిపోయే స్థితిలో ఉంది. సోమవారం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి బాపట్ల పట్టణంలో రోడ్లపై వరదనీరు మోకాళ్ల లోతు వరకు చేరింది. రోడ్లపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



## తుపాను ప్రభావం.. విశాఖ నుంచి 23 విమానాలు రద్దు

మిగ్‌జాం తుపాను ప్రభావం కారణంగా పలు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు విశాఖ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ వెల్లడించారు. ఈమేరకు విశాఖ నుంచి 23 విమానాల సర్వీసులను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. "విమానాశ్రయాన్ని పూర్తిస్థాయిలో ఆపరేషన్‌లో ఉంచుతున్నాం. అత్యవసర సర్వీసులు, మళ్లింపుల కోసం ఏటీసీ 24 గంటలూ పని చేస్తుంది. రన్‌వే నవీకరణ పనుల వల్ల రాత్రి 8 వరకే విమానాశ్రయంలో రాకపోకలకు అనుమతి ఇస్తున్నాం" అని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ తెలిపారు. మరికొన్ని గంటల్లో బాపట్లకు సమీపంలో 'మిగ్‌జాం' తుపాను తీరం దాటనుంది. కోస్తాంధ్ర తీరానికి సమాంతరంగా కదులుతోంది. తీవ్ర తుపానులో కొంతభాగం సముద్రంలో.. మరికొంత భాగం భూమిపై ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. తీరానికి అత్యంత దగ్గరగా తుపాను కదులుతోందని చెప్పింది. కావలి తీరానికి 40కి.మీ., బాపట్లకు 80కి.మీ. దూరంలో తీవ్ర తుపాను ఉన్నట్లు వివరించింది. ప్రస్తుతం తీరప్రాంతంలో గంటకు 90-110 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నట్లు ఐఎండీ వెల్లడించింది.




## భారత్ మరో విజయం..
## జాబిల్లి కక్ష్య నుంచి భూ కక్ష్య దిశగా ప్రొపల్షన్ మాడ్యూల్..!

చంద్రయాన్-3 ప్రాజెక్టులో భాగంగా భారత అంతరిక్ష సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగాన్ని విజయవంతంగా మొదలు పెట్టింది. చంద్రుడి కక్ష్యలోకి పరికరాలను పంపిన ఇస్రో.. ఇప్పుడు వాటిని వెనక్కి తీసుకురావడంపై దృష్టిపెట్టింది. ఇటీవల చంద్రయాన్-3లో భాగంగా ప్రయోగించిన ప్రొపల్షన్ మాడ్యూల్‌ను తాజాగా జాబిల్లి కక్ష్య నుంచి తిరిగి భూకక్ష్యవైపు మళ్లించినట్లు ఇస్రో ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టు అనుకున్న దాని కంటే అధిక ఫలితాలను భారత్‌కు అందించినట్లైంది. తాజాగా దీనికి సంబంధించిన సమాచారాన్ని ఇస్రో ట్వీట్ చేసింది. కక్ష్యపాడిగింపు, ట్రాన్స్ ఎర్త్ ఇంజెక్షన్ విన్యాసాలతో దీనిని పూర్తిచేసినట్లు వెల్లడించింది. భారత్ ప్రొపల్షన్ మాడ్యూల్ మార్గాన్ని తెలివిగా ప్లాన్ చేయడంతో.. దాదాపు 100 కిలోల ఇంధనం దీనిలో మిగిలింది. దీనిని వాడుకొని మరికొన్ని పరిశోధనలు పూర్తిచేశారు. అనంతరం చంద్రుడి కక్ష్య నుంచి దీని మార్గాన్ని భూకక్ష్య వైపు మళ్లించారు. దీనిపై ఉన్న SHAPE పేలోడ్ భూమిపై పరిశోధనలు నిర్వహించనుంది. ఇది 36,000 కిలోమీటర్ల ఎత్తులో భూమి జియో బెల్ట్‌లోకి ప్రవేశించే సమయంలో, దిగువ కక్ష్యలోకి వచ్చే సమయంలో ఉపగ్రహాలను ఢీకొనకుండా అక్టోబర్‌లోనే పక్కగా ప్లాన్ చేశారు. చంద్రయాన్-3లోని మూడు ప్రధాన భాగాల్లో ప్రొపల్షన్ మాడ్యూల్ కూడా ఒకటి. ఇది కాకుండా ల్యాండర్ మాడ్యూల్, రోవర్ ఉన్నాయి. ఇక ప్రొపల్షన్ మాడ్యూల్‌తో ల్యాండర్ మాడ్యూల్ అనుసంధానమై ఉంటుంది. ఇది వాహకనౌక నుంచి విడిపోయి, ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడికి 100 కి.మీ. సమీపం వరకు తీసుకెళ్లింది. ఆ తర్వాత ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ విడిపోయింది. ప్రొపల్షన్ మాడ్యూల్ కొన్ని నెలల పాటు కక్ష్యలోనే ఉంది. దీనిలోని పరికరం సాయంతో సమాచారాన్ని సేకరించి శాస్త్రవేత్తలకు పంపింది.